క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు ప్రారంభం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కాళ్ల: మండలంలోని కోపల్లెలో నగరపేట ప్రాంతంలో చెరువు పూడికతీత పనులు సోమవారం సర్పంచ్ బి.నాగమణి ప్రారంభించారు. పూర్తిగా పూడుకుపోయిన పంచాయతీ చెరువును మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సుమారు రూ.4 లక్షలతో 1266 పని దినాల అంచనాతో పనులు చేపట్టినట్లు ఇంజినీరింగ్ కన్సల్టెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.వెంకట పత్రాలు, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న పెయింటర్ల అధ్యక్షుడు చిగురుపాటి మాణిక్యాలరావు

పాలకోడేరు: మండలంలోని పెయింటింగ్ వృత్తి చేసే వారు యూనియన్‌గా ఏర్పడాలని పలువురు పెయింటర్లు అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు సోమవారం మోగల్లులో సమావేశమై పెయింటర్ల అభివృద్ధికి, అభ్యున్నతికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య నిర్వహణ కర్తగా చిగురుపాటి మాణిక్యాలరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిగురుపాటి మాణిక్యాలరావు, గౌరవ అధ్యక్షుడిగా చిర్రా చిన్ని, ఉపాధ్యక్షుడిగా కోమటి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఊడి కిరణ్, సహాయ కార్యదర్శిగా దిరిసిపో చంటి, కోశాధికారిగా బొబ్బనపల్లి నరేష్, మెంబర్లుగా కౌరు శివ నాగేశ్వరరావు, పెద్దాడ అర్జున్, బలే నానిల ఎన్నికయ్యారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ కఠారి జయలక్ష్మి

ఆకివీడు: స్థానిక మండల పరిషత్ నిధులతో మండలంలోని పెదకాపవరం గ్రామంలో కాళింగపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎంపీపీ కఠారి జయలక్ష్మి భూమి పూజ చేశారు. కాళింగ ప్రజలకు దీర్ఘకాలింగా ఉన్న సమస్య పరిష్కారానికి రూ.3 లక్షల ఎంపీపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాస్తున్నామన్నారు. 47 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, ఉపసర్పంచ్ పాతపాటి పద్మావతి శ్రీనివాసరాజు, కఠారి కేశవరావు, స్థానికులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం



రాములోరిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

ఆకివీడు: శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక ఎస్‌టర్నింగ్ వద్ద వేంచేసియున్న రాములోరి ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను సోమవారం రథంలో ఊరేగించారు. తొలుత స్వామి వారికి మహాకుంభ నైవేద్యం సమర్పించారు. అనంతరం పూలతో అలంకరించిన రథంలో సీతారాములోరు, లక్ష్మణ, ఆంజనేయులను ఊరేగించారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు రథం లాగుతూ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

పీజీఆర్‌ఎస్‌కు 8 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు సోమవారం 8 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని చెప్పారు. అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించడం వలన నగర పంచాయతీకి ఆదాయం పడిపోతుందని, ఇటీవల కాలంలో నగర పంచాయతీలో అనుమతులు లేకుండా స్థానిక సంతపేట వద్ద, అయిభీమవరం రోడ్డుల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని నిలుపుదల చేసి, పంచాయతీ ఆదాయం వృద్ధి చేయాలని ఫిర్యాదులు అందాయన్నారు. ఆస్తి తగాదా, తాళ్లకోడులో ఎన్ని పట్టాలు ఇచ్చారు. ఇటీవల సర్వేలో ఎన్ని పట్టాల్లో కాపురం ఉంటున్నారనే సమాచారం ఇవ్వాలని, నగర పంచాయతీలో తినుబండారాలు, కాఫీ హోటళ్లు, ఇతరత్రా తినుబండారాలు, నిత్యవసర వస్తువుల విక్రయాలపై ఎన్ని తనిఖీ చేశారు. ఎంతమందిపై కేసు నమోదు చేశారనే సమాచారం కోసం ఫిర్యాదు అందిందన్నారు. వీటితో పాటు పలు సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు.

దాళ్వా మాసూళ్లు ప్రారంభం

- 45 నుంచి 60 బస్తాల దిగుబడి
- మబ్బులతో రైతుల కలవరం



గునుపూడి వద్ద వరికోత యంత్రంతో మాసూళ్లు చేస్తున్న రైతులు



ఆశాజనకంగా పండిన వరి చేలు

భీమవరం అర్బన్: మండలంలో దాళ్వా మాసూళ్లు ప్రారంభమయ్యాయి. యనమదుర్రు, దిరుసుమర్రు, అనాకోడేరు, కొమరాడ, చిన అమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం, తుందుర్రు, బేతపూడి తదితర గ్రామాల్లో సుమారు 8 వేల ఎకరాల్లో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టారు. వరి చేలు పక్వానికి వ్చి కోత దశలో ఉన్నాయి. మరో రెండు, మూడు వారాల్లో మాసూళ్లు పూర్తవుతాయని రైతులు చెబుతున్నారు. ముందుగా వరి నాట్లు వేసిన గునుపూడి, యనమదుర్రు గ్రామాల్లో పంట కోతకు రావడంతో రైతులు వరి కోత యంత్రంతో మాసూళ్లు సాగిస్తున్నారు. ఈ ఏడాది నీటి ఎద్దడి లేకపోవడంతో పంట ఆశాజనకంగా పండిందని రైతులు చెబుతున్నారు. ఆయకట్టును బట్టి ఎకరానికి 45 నుంచి 60 బస్తాల వరకు పండుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత సార్వాలో 3 వేల ఎకరాల్లోనే సాగు

గత సార్వాలో 6 వేల ఎకరాల్లో పంట సాగు చేయాల్సి ఉంది. అధిక వర్షాల కారణంగా పంట పొలాల్లో నీరు లాగకపోవడంతో సుమారు 3 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అయినప్పటికీ చివరిలో తుఫాన్ల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం దాళ్వా పంట ఆశాజనకంగా పండిందని గతంలో మిగిలిన అప్పులు కొంతైనా తీరుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మబ్బులతో రైతులు కలవరం

గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు సంతరించుకుని ఆకాశం మబ్బులు ఏర్పడటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏడాది కోత దశలో వర్షాలు, ఈదురు గాలులతో తీవ్రంగా నష్టపోయే వాళ్లం. ఇప్పుడు కూడా అలా జరిగితే పరిస్థితి ఏమిటోనన్న భయాందోళనలో రైతులు ఉన్నారు.

ఆరోగ్య నియమాలతో నూరేళ్లు



భీమవరం(ప్రకాశంచౌక్): కూజాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



పాలకోడేరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కాళ్ల: పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు సునీల్, సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రపంచంలో ప్రాణకోటిలో మానవ జన్మ పవిత్రమైనదని, ఆరోగ్య సూత్రాలు పాటిస్తే నిండు నూరేళ్ల జీవించొచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.గోవింద్ బాబు అన్నారు. విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించి 42 మంది రోగులకు మంచినీటి కూజాలు, విసన కర్రలు, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. గోవింద్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ కాలుష్య వలన అంతుచిక్కని రోగాలు వస్తున్నాయని, నిరంతరం ఆరోగ్య రక్షణపై దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాంతకమన్నారు. న్యాయవాది సూరిశెట్టి కల్పన మాట్లాడుతూ బాలింతలు తమ పిల్లలకు తల్లి పాలు పట్టడం ఆరోగ్యమని, ప్రతి ఒక్కరూ వేడి చేసిన మంచినీటిని తీసుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ ఏడాది ఆరోగ్యమే మహా భాగ్యం అనే నినాదంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే చాన్‌భాషా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పాలకోడేరు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగమనాయుడు ఆధ్వర్యంలో పాలకోడేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగమనాయుడు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నినాదాలైన మంచి ఆరోగ్యాన్ని గురించి మంచి ఆహారపు అలవాట్లను గురించి మంచి నీటిని ప్రతి ఒక్కరికీ అందించాలని వివరించారు. అంతే కాకుండా ప్రస్తుతం ఎండాకాలం కనుక వడ దెబ్బలు తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఓఆర్‌ఎస్ ద్రావణం గురించి, పరిసరాల పరిశుభ్రతపై విపులంగా తెలియజేశారు. ఈ ర్యాలీలో మరో వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు శంకర్, అమ్మాజీ, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కాళ్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కాళ్ల మండల వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ర్యాలీ నిర్వహించి, అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచంలో సంభవించే విపత్కర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఒక నినాదాన్ని ఇస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది ఆరోగ్యకరమైన ప్రారంభం -ఆశాజనక భవిష్యత్తు అనే నినాదం ఇచ్చిందన్నారు. తల్లులు, శిశువుల ఆరోగ్యకర సమాజాలకు పునాది అని గర్భిణిగా ఉన్నప్పుడు ఐసీడీఎస్ వారు అందించే మంచి పోషకాహారాలను తీసుకుంటూ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందించే వైద్య పరీక్షలు, టీకాలు, మందులు తీసుకుంటూ ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం అందుబాటులో ఉండాలి



నియోజకవర్గ లీగల్ సెల్ కార్యాలయాన్ని ప్రారంభించిన పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: పేదలకు న్యాయం అందుబాటులో ఉండాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. స్థానిక బైపాస్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్, అడ్వకేట్ రుంకాన శ్రీహరి కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పేదలకు, కార్యకర్తలకు అండగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో లాయర్లకు రూ.5 వేల గౌరవ భృతి కల్పించారని పీవీఎల్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం లాయర్లకు ఏ విధమైన సౌకర్యాలూ కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మానికి కట్టుబడి పని చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందొచ్చన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్, మంతెన సునిల్ కుమార్‌వర్మ, కేశిరెడ్డి మురళీ, దిలీప్, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, అందే రాజబాబు, కుంకట్ల దానయ్య, సత్యనారాయణ, హుస్సేన్, మెంటే లక్ష్మణరావు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమసుందర్

భీమవరం: ప్రైవేట్ సంస్థల బస్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలో నిర్వహించిన జనతా బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశానికి యూనియన్ గౌరవాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అధ్యక్షత వహించగా సోమసుందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ సంస్థలకు చెందిన వందలాది బస్సుల్లో పెద్ద సంఖ్యలో డ్రైవర్స్, ఇతర కార్మికులు పని చేస్తున్నారని అయితే వారి సంక్షేమాన్ని యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. వీరికి కార్మిక చట్టాలు అమలు కాకపోవడం విచారకరమని సోమసుందర్ ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, ఏఐటీయూసీ నాయకుడు ఎం.లక్ష్మీపతి, జనతా బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాసాని వెంకటేశ్వరరావు, తాడి వీర వెంకట సత్యనారాయణ (పండు), కొప్పినీడి మురళీమోహన్, బత్తిన సుబ్బారావు, సంగీతం మంగన్న, తదితరులు పాల్గొన్నారు.

16న నాటకోత్సవాలు ప్రారంభం



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న నిర్వాహకులు

భీమవరం: కళారంజని జాతీయ స్థాయి నాటకోత్సవాలు ఈ నెల 16, 17,18 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావు చెప్పారు. సోమవారం భీమవరంలో నాటకోత్సవాల ఆహ్వాన పత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జవ్వాది దాశరథి శ్రీనివాస్ మాట్లాడుతూ పోటీల్లో మూడు రోజుల్లో ఆరు నాటికలు ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ పోటీలు 16వ తేదిన గునుపూడి గుడి ఆవరణలో ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో మొదటి రోజున కాకినాడకు చెందిన బీవీకే క్రియేషన్స్ తితిక్ష, విజయవాడ శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ అనస్వరం నాటికలు ప్రదర్శిస్తారన్నారు. 17న గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇత అతని సంతకం, ఏలూరు హేలాపురి కల్చరల్ అసోసియేషన్ స్వారీ రాంగ్ నంబర్ నాటికలు, 18న హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్స్ వారి హక్కు, ఉత్తరాంధ్ర, సౌజన్య కళా స్రవంత దేవరాగం నాటికలు ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మెంటే పూర్ణచంద్రరావు, కార్య నిర్వహణ కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, పి.అర్జున్‌రావు, ఆక్వా శ్రీనివాస్, పోసింశెట్టి మురళి, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై దర్యాప్తు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐక్య క్రైస్తవ అధ్యక్షుడు లివింగ్‌స్టన్

ఆకివీడు: మిషనరీ పగడాల ప్రవీణ్ మరణం మిస్టరీ కాకూడదని, న్యాయమైన దర్యాప్తు చేయించాలని ఐక్య క్రైస్తవ (సీబీసీఎన్‌సీ ఈస్టు ఆకివీడు ఫీల్డ్) శాంతి సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం సమావేశం సంఘ అధ్యక్షుడు జీడీ లివింగ్‌స్టన్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పలువురు పాస్టర్లు, సంఘ పెద్దలు, కాపరులు కార్యవర్గ సభ్యులు, సీఆర్‌లు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు వస్తున్నాయన్నారు. దీనిపై దర్యాప్తు చేయడంలోనూ, పోస్టు మార్టం రిపోర్టు ప్రకటించడంలో జాప్యం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పగడాల కుటుంబానికి, క్రైస్తవ సమాజానికి న్యాయం జరిగే విధంగా శాంతి యుత ర్యాలీ నిర్వహించుకునేందుకు అడ్డు పడటం దారుణమన్నారు. మా గొంతు నొక్కినా.. ఘోషను ఆగదని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదులు మాత్రం సోషల్ మీడియాలో తమ ఇష్టానుసారం పోస్టులు పెడుతున్నారని, వీటిని అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పగడాల కుటుంబానికి, క్రైస్తవ సమాజానికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జీడీ లివింగ్‌స్టన్, కన్వీనర్ బి.బెంజిమెన్, సత్యానందం, జార్జి ముల్లర్, ఎలీషా, ఎం.జ్ఞాన్‌రాజు, మెడవంకల రత్నకుమార్, బొడ్డు వజ్రం, బి.అబ్రహాం, తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజ మార్గం



వివరాలు వెల్లడిస్తున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీయే రాజ మర్గామని మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎంఏ సోమశేఖర్ అన్నారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ చేసుకుంటే సమయం, నగదు ఆదా అవుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 10న కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి సోమశేఖర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనోవర్తి, మోటార్ యాక్సిడెంట్ బీమా, గృహహింస, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ మొండి బాకీ కేసులు వంటివి రాజీ చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ రాజీ అంతిమ తీర్పు కావడంతో అప్పీలు చేసుకునే అవకాశం ఉండదన్నారు. సివిల్ కేసుల్లో రాజీ చేసుకుంటే ముందుగానే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందని కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి సోమశేఖర్ తెలిపారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు రాజీ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించి ఎక్కువ కేసుల రాజీకి ప్రయత్నం చేయాలని సూచించారు.

ఫెన్సింగ్ క్రీడాకారిణి ధృతి సమీక్షకు అభినందన

భీమవరం: ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన మంతెన ధృతి సమీక్షను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అభినందించారు. పట్టణానికి చెందిన ధృతి సమీక్ష గత నెల 27వ తేది నుంచి 30 వరకు ఒరిస్సాలోని కటక్‌లో నిర్వహించిన నేషనల్ ఫెన్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించి జూలై 22వ తేది నుంచి 30 వరకు జార్జియాలో జరిగే ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో ధృతి సమీక్షను సోమవారం ఎమ్మెల్యే అభినందించారు.

కేసును ఛేదించిన అధికారులకు అభినందన

భీమవరం: గుడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్‌ను బలోపేతం చేసి బాధితులకు, ఫిర్యాదుదారులకు ఖచ్చితమైన న్యాయం అందించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తున్నట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. పాలకొల్లులో ఒంటరి మహిళపై దాడి చేసి అత్యాచారం, హత్య, బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో ముద్దాయిలకు తీర్పు వెలువడిన సందర్భంగా కేసును ఛేదించిన పోలీసు అధికారులు, ఏపీపీని సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో అభినందించారు. మొత్తం కేసును 8 నెలల 9 రోజుల్లో విచారణ పూర్తి చేసినందున దర్యాప్తు అధికారులు పాలకొల్లు సీఐ కె.మంగాదేవి, ఎస్సై కె.రజనీకుమార్, కోర్టు కానిస్టేబుల్ ఎస్.మురళి, లైజనింగ్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఏఎస్పీ వి.భీమారావు, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద, ఏపీపీ డీవీ రామాంజనేయులు, తదితరులను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆకివీడు: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో కొత లైన్ల ఏర్పాటు దృష్ట్యా 8వ తేదీ ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. అజ్జమూరు, మాదివాడ, ఆకివీడులో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అశ్లీల నృత్యాలపై దాడి

యలమంచిలి: మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. ఈ దాడిలో ఇద్దరు ట్రాన్స్ జెండర్లు, ఐదుగురు వ్యక్తులను పట్టుకుని, కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

పంట నష్ట పరిహారం చెల్లించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో గత సార్వా పంట నష్టం వెంటనే రైతులకు చెల్లించాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. కౌలు రైతుల సంఘం తరపున కలెక్టర్ నాగరాణికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోఅధిక వర్షాలకు జిల్లాలో 17 మండలాల్లో 135 గ్రామాల్లో 10,900 ఎకరాలు పైబడి పంటలు ముంపునకు గురై దెబ్బ తిన్నాయన్నారు. ఈ దశలో వ్యవసాయ అధికారులు జిల్లాలో 8729 మందికి 9.54 కోట్ల పంట నష్టం అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 2019 కౌలు చట్టాన్ని రద్దు చేసి, ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం 2024 తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం విధి విధానాలు తయారు చేసి రాష్ట్రంలోని ప్రాంతీయ సదస్సులు పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసిందని కానీ ఇంత వరకు అధికారికంగా పాత చట్టాన్ని రద్దు చేయలేదని కొత్త చట్టం ఆమోదించలేదన్నారు. కౌలు రైతులకు భూయజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వకుండా పెట్టుబడి సాయం వేస్తే వాస్తవంగా పంటలు పండించే కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

బధిర క్రీడాకారులకు ఆర్థిక సాయం



హర్యానా వెళుతున్న క్రీడాకారులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

భీమవరం: క్రీడాకారులను ప్రోత్సహిస్తే క్రీడల్లో మరింత రాణిస్తారని బిల్డర్స్ అసోసియేషన్ నాయకుడు గన్నాబత్తుల శ్రీనివాస్ అన్నారు. హర్యానాలో ఈ నెల 19 నుంచి 25 వరకు నిర్వహించే జాతీయ స్థాయి 7వ బధిర (మూగ, చెముడు) క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనడానికి భీమవరం నుంచి వెళుతున్న క్రీడాకారులకు దాతల సహకారంతో రూ.30 వేలు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా బధిర అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్ష, కార్యదర్శులు బీఎంకే రాజు, సీహెచ్ రామచంద్రరావు, సీహెచ్ తాతారావు మాట్లాడుతూ భీమవరం నుంచి 16 మంది బధిర క్రీడాకారులు హర్యానా క్రికెట్ పోటీలకు వెళుతున్నారని వారికి దాతలు అయ్యగారి నగేష్ రూ.10 వేలు, పాత్తూరి బాపిరాజు రూ.10 వేలు, వేగేశ్న రంగరాజు రూ.5 వేలు, అరేటి ప్రకాష్ మిత్రులు రూ.5 వేలు సమకూర్చారన్నారు. కార్యక్రమంలో పుప్పాల శేషు, అడపా బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడి సేవలు అభినందనీయం



అర్చకుడు పవన్‌కుమార్‌కు బంగారం అందిస్తున్న నాగాంజనేయులు

కాళ్ల: గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని అర్చకత్వం చేస్తున్న పవన్‌కుమార్ సేవలు అభినందనీయమని కేవీఎల్ సీఫుడ్స్ అధినేత మంతెన నాగాంజనేయులు అన్నారు. కాళ్ల మండలం కోమటిగుంట గ్రామంలో వేంచేసియున్న కోదండ రామాలయంలో అర్చకత్వం చేస్తున్న పవన్ కుమార్‌కు సోమవారం సత్కారం నిర్వహించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గత పది సంవత్సరాలుగా ప్రతి ఏడాది అర్చకుడికి కాసు బంగారాన్ని బహుమతిగా ఇస్తున్న నాగాంజనేయులు, నాగమణి దంపతులను ఈ సందర్భంగా పలువురు పెద్దలు అభినందించారు. అనంతరం శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు యలమంచిలి వెంకట రమణ, గణపతి, పులమంతుల ఏసురాజు, కాపుశెట్టి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.